క్లుప్తంగా

పాడి పశువులకు టీకాలు వేయించాలి



పశువైద్య సిబ్బందికి టీకాలపై సూచనలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పాడి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. యండగండి గ్రామంలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ టీకాల కార్యక్రమం పశువైద్య సిబ్బంది నిర్వహిస్తారన్నారు. అనంతరం గ్రామంలో 35 మంది పాడి రైతులకు చెందిన 89 పశువులకు టీకాలు వేశారు. పామర్రు పశువైద్యాధికారి బిందు, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేత్రదానం

మండపేట: తాను చనిపోతూ మరికొందరి జీవితాల్లో వెలుగు పంచి ఆదర్శంగా నిలచారామె. ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు మృతురాలి రెండు కళ్లను దానం చేసి ఔన్నత్యాన్ని చాటుకున్నారు. వివరాలిలా వున్నాయి. పట్టణానికి చెందిన కాపు నాయకుడు, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొనగళ్ల భాస్కరరావు సతీమణి సూర్యప్రభ(70) మరణించారు. ఇటీవల అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఇంటికి చేర్చారు. వారం రోజులుగా తన పని తాను చేసుకుంటూ ఆరోగ్యంగా తిరుగుతున్న సూర్యప్రభ సోమవారం ఉదయం చాతిలో నొప్పి వస్తుందంటూ క్షణాల్లో ఊపిరి వదిలారు. దీంతో కుటుంబ సభ్యులు సూర్యప్రభ నేత్రాలను దానం చేసేందుకు కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు సమాచారమిచ్చారు. ఐ బ్యాంకు బృందం ప్రత్యేక వాహనంలో పట్టణంలోని చిన్న గొల్లపుంతలో ఉన్న మృతురాలి నివాసానికి చేరుకుని నేత్రాలను సేకరించారు. ఈమెకు కుమారుడు రాజేష్, కుమార్తె చంద్రిక ఉన్నారు. ఆమె మృతిపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), కౌన్సిల్‌విప్ పోతంశెట్టి వర ప్రసాద్, కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయిబాబా, పట్టణ ప్రముఖులు ఉంగరాల రాంబాబు, అధికారి శ్రీనివాస్, మెండు బాపిరాజు తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు.

పదో తరగతి విద్యార్థుల హాల్‌టికెట్ల విడుదల

కాజులూరు: త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల విద్యార్థులకు హాల్‌టికెట్లు విడుదల చేసినట్టు గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్ సుశీలామణి తెలిపారు. విద్యార్థులు పాఠశాల లాగిన్ అధికారిక వెబ్‌సైట్ bse.ap.gov.in లో కాని మన మిత్ర, ప్రభుత్వ వాట్సాప్ సేవా 9552300009 ద్వారా కాని హాల్‌టికెట్లు పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: అంగరలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందబాంబ, సిద్ధయ్య విగ్రహాల త్రయాహ్నిక ప్రతిష్ఠా ఉత్సవం మంగళవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శ్రీఅశిరాంబ అమ్మవారి ఆలయం సమీపంలో శిథిల మందిరాన్ని తొలగించి నూతనంగా నిర్మించారు. ఉగాది పురస్కార గ్రహీత తాళాభక్తుల వీరభద్రాచార్యులు, అత్తిలి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ పూజలు 6వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. నేడు విఘ్నేశ్వరపూజ ప్రతిష్ఠ సంకల్పం, వాస్తుహోమ పూజలు చేయనున్నారు. 6న స్వామివార్ల విగ్రహాల తయాహ్నిక ప్రతిష్ఠ, శాంతి కల్యాణ ఉత్సవ పూజలు చేయనున్నారు. అదే రోజు మందిరం వద్ద అన్న సమారాధన చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు మండల స్థాయి అవగాహన సదస్సు

రాయవరం: సోమేశ్వరం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసరావు సోమవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ప్రతి పంచాయతీ నుంచి క్లాప్ మిత్రలు ఈ సమావేశానికి హాజరవుతారని ఆయన తెలిపారు.

వీర్రాజు కుటుంబ సభ్యులకు పరామర్శ

కపిలేశ్వరపురం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చల్లా వీర్రాజు కుటుంబ సభ్యులను ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. నాయకులు రుద్రాక్షుల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు పరామర్శించినవారిలో ఉన్నారు.

ప్రతి క్షణం పరీక్షే..

- విద్యార్థులు సురక్షిత ప్రయాణం చేయాలి
- అనుకున్న సమయానికి ముందే కేంద్రాలకు చేరాలి
- విద్యార్థులను తరలించే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి
- మార్చి 15 వరకూ ఇంటర్ పరీక్షలు
- 17 నుంచి 30 వరకూ 'పది' పరీక్షలు



అంగరలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవికుమార్



చెల్లూరు సమీపంలో పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న చిన్నారులు (ఫైల్)

కపిలేశ్వరపురం: ఏడాదిలో చదివిన చదువుకు అక్షర రూపం ఇచ్చే ప్రక్రియే పరీక్షలు రాయడం. ఈ పరీక్షల సమయంలో విద్యార్థులు పలు జాగ్రత్తలు వహించాలి. పరీక్షలు రాసేందుకు కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు సురక్షిత ప్రయాణాలు చేయడం అత్యంత అవసరం. కొంత మంది తామే వాహనాలు నడుపుతారు. ఇంకొంత మంది వాహనాల్లో వెళుతుంటారు. అలాంటి సమయంలో అందరూ జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులను కేంద్రాలకు తరలించే వాహనాల డ్రైవర్లు రోడ్డు, వాహన నిబంధనలను విధిగా పాటించాల్సి ఉంది. పరీక్షలు వేళ ఇబ్బందులకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని చాటి చెబుతూ ఈ కథనం..

అనవసరమైన ప్రయాణాలతో అనర్థం

పరీక్షా కాలంలో ప్రతి క్షణమూ విలువైనదే. అనవసరమైన ప్రయాణాలతో అనర్థం తెచ్చుకోకుండా విద్యార్థులు జాగ్రత్తపడాలి. ప్రమాదాల బారిన పడుతున్న వారిలో 18–45 ఏళ్ల వయస్సుగల వారు 66.5 శాతం మంది ఉంటున్నారన్నది ఓ అంచనా. మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు వాహనాలను నడుపుకొంటూ వెళ్తున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వారి వయస్సు రీత్యా వాహనాన్ని నడిపే అర్హత ఉండదు. 18 ఏళ్ల నిండినవారు లైసెన్స్ లేకుండా ప్రయాణాలు చేయడం సరికాదు. పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి. నిబంధనలపై అవగాహన ఉండాలి. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లేవారు హెల్మెట్ ధరించాలి. టూ వీలర్‌పై ముగ్గురు ప్రయాణం చేయడమంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే అన్నది గమనించాలి. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాన్ని నడపడం అత్యంత ప్రమాదకరమని తెలుసుకోవాలి. సకాలంలో కేంద్రానికి చేరుకునేందుకు అనుకున్న సమయాని కంటే ఒక అరగంట ముందు బయలుదేరడం ఉత్తమము. పరీక్షలు జరిగే అన్ని రోజులూ సోషల్ మీడియా మాధ్యమాలకు దూరంగా ఉండడం ద్వారా విలువైన సమయాన్ని త్వరగా కేంద్రానికి చేరుకునేందుకు, చదువుకునేందుకు వినియోగించుకోవచ్చు.

నిబంధనలు మీ కోసమే..

నిబంధనలు ప్రమాదాలకు దూరంగా ఉంచుతాయి. ఇవి చట్ట పరిధిలో రూపొందించినవి. వాటిని పర్యవేక్షిస్తున్న సమయంలో పోలీసుల కళ్లుగప్పి ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లిపోవాలన్న ఆలోచన సరికాదు. ఆటోలో ఆరుగురు మాత్రమే ప్రయాణం చేయాలి. విద్యార్థులను ఆటోలో తరలించేవారు 10 కిలోమీటర్లలోపు ఉన్న విద్యాసంస్థలకు మాత్రమే తీసుకెళ్లాలి. ఆటో నడిపే కార్మికుని పక్కన ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణికులు కూర్చోకూడదు. ఆటోకు రెండు వైపులా రక్షణ కవచం ఉండాలి. డ్రైవర్‌కు లైసెన్స్, వాహనానికి పర్మిట్ తప్పనిసరిగా ఉండాలి.

కేసుల్లో ఇరుక్కోకుండా..

పరీక్షా సమయంలో ఆవేశాలకు లోనుకావడం నష్టం తెస్తుంది. కోపం, అసహనాలు కలిగినప్పుడు పరీక్షలు రాస్తున్న సమయమన్న విషయాన్ని గుర్తు చేసుకుని సర్దుకు పోతుండాలి. లేదంటే అనవసరమైన వివాదాల్లో ఇరుక్కుంటారు. చేతులు కర్రతో దాడి చేస్తే భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 115, 118(1), 118(3) కింద కేసులు నమోదు చేస్తారు. కక్ష కట్టి ఉద్దేశ పూర్వకంగా దాడికి దిగితే సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు చేస్తారు. హత్యకు పాల్పడితే సెక్షన్ 103 కింద కేసు నమోదు చేస్తారు. ఒకసారి కేసు నమోదు అయితే విద్యార్థి జీవితం ఇబ్బందులు పాలవుతుంది. నేర తీవ్రతను బట్టి చర్యలుంటాయి. ఉద్యోగమూ, పాస్‌పోర్టు రాని పరిస్థితికి వెళ్తారు.

> **అనుకున్న సమయానికి ముందే బయలుదేరాలి**
>
> 
>
> చేరుకోవాల్సిన గమ్యానికి అనుకున్న సమయానికంటే ముందే బయలుదేరడం మేలు. చట్ట పరిధిలో నడిచే వాహనాల పైనే ప్రయాణం చేయాలి. మైనర్లకు వాహనాలిస్తే వాహన యాజమానులపై చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటాం. వాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోవడం, వేగ నియంత్రణను పాటించడం విధిగా చేయాలి.
>
> – పి.దొరరాజు, సీఐ, మండపేట రూరల్

గతంలో మృత్యు బారిన పడిన విద్యార్థులు

2024 ఫిబ్రవరి 15న మండపేట పట్టణం మెహర్ బాబా ఆశ్రమం సమీపంలో లారీ ఢీకొని పట్టణంలోని ప్రైవేటు కళాశాలలోని సెకండ్ ఇంటర్ విద్యార్థి పెడాల మధుసాయి మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. 2023 ఫిబ్రవరి 26న అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెం శివారు టి.సావరం వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అమలాపురంలోని కళాశాలకు ప్రాక్టికల్ పరీక్షకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తున్న నందెపు రాజేష్ (17), అల్లపల్లి నాగేంద్ర (17) అనే ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. 2023 జూన్ 3న అమలాపురం మండలం నడిపూడికి చెందిన పదో తరగతి విద్యార్థి పెనుమల ప్రశాంతి(16) నడిపూడిలో మట్టి ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. 2023 మే 19న అమలాపురం మహిపాల వీధికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని గంగా లక్ష్మీ జాహ్నవి (11) గాంధీనగర్ వద్ద మట్టి ట్రాక్టర్ ఢీకొని అదే రోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. 2023 డిసెంబర్ 3న మండపేట పట్టణంలోని మారేడుబాక వంతెన వద్ద కారు ఢీకొని మారేడుబాక గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి మాడెం ప్రవీణ్ (11) మృతి చెందాడు.

సాగునీటి ఎద్దడి అధిగమించేలా ఏర్పాట్లు చేపట్టాలి

కాజులూరు: సాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితర బాధిత రైతులు కోరుతున్నారు. సోమవారం కాజులూరులో రైతులు మాట్లాడుతూ గతంలో దాళ్వా సాగు చివరి దశలో సాగునీటి కొరత ఏర్పడేదని అటువంటి పరిస్థితులలో ప్రభుత్వం మండల గ్రామాల మీదుగా ప్రవహించే డ్రైన్లకు క్రాస్‌బండలు ఏర్పాటు చేయించేదన్నారు. పరిసర రైతులు డ్రైన్లలో నిల్వ ఉన్న నీటిని ఆయిల్ ఇంజన్లతో పంట పొలాలకు తోడుకునేందుకు వారికి ఇంజనాయిల్ సరఫరా చేసేదన్నారు. అయితే ప్రస్తుతం దాళ్వా సాగు తొలిదశలోనే సాగునీటి ఎద్దడి తలెత్తిందని, దీంతో తూర్పుడెల్టా కాలువ నుంచి సాగునీటి విడుదల తగ్గిపోవడంతో గత 15 రోజులుగా కాలువ శివారుభూములలో ఉన్న కాజులూరు మండల గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి డ్రైన్లకు క్రాస్‌బండలు ఏర్పాటు చేసి ఇంజన్ఆయిల్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా పిల్లి కల్యాణ్



కె.గంగవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా మసకపల్లి గ్రామానికి చెందిన పిల్లి కల్యాణ్ నియమితులయ్యారు. ఈ మేరకు రామచంద్రపురం పార్టీ ఇన్‌చార్జ్, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉత్తమ సేవలు అందించి ప్రతి ఒక్కరి మన్ననలను పొందుతానని కల్యాణ్ చెప్పారు. ఈ సందర్భంగా కల్యాణ్‌ను ఎంపీపీ పంపన నాగమణి, మండల పార్టీ కన్వీనర్ పెట్టా శ్రీనివాస్, పార్టీ నాయకులు అభినందించారు.

నేడు, రేపు జిల్లా అంతటా నిరసనలు



వెంకన్నబాబు

రామచంద్రపురం రూరల్: సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు అంతా మంగళ, బుధవారాల్లో డిమాండ్ల సాధన కోసం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు పిలుపు ఇచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వకుండా జీఓ నెం.2 ఇచిందన్నారు. ఈ జీఓను తక్షణం ఉపసంహరించాలని, మినిమం టైం స్కేలు అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, జీతంతో కూడిన మెడికల్ లీవులు అమలు చేయాలని, గత ప్రభుత్వ సమ్మె ఒప్పందాలన్నీ ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని, ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులపై తమ పాలసీని ప్రకటించాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా అంతటా నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో మోటారుసైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అల్లవరం మండలం డి.రావులపాలెంకు చెందిన గోళ్ల చంద్రరావు ఈ నెల ఒకటో తేదీన ద్రాక్షారామలోని మాచవరం ఏడుకొండలు బట్టల షాపులో దుస్తులు కొనుగోలు చేయడానికి షాపు బయట మోటారుసైకిల్ ఉంచి లోపలికి వెళ్లాడు. అయితే బట్టలు కొనుక్కుని తిరిగి వచ్చే సరికి మోటారు సైకిల్ కనిపించలేదు. దీనిపై సోమవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పన్ను వసూళ్లపై దృష్టి



వార్డుల్లో శుభ్రతపై మహిళలకు వివరిస్తున్న కమిషనర్ రంగారావు

- మార్చి నెలాఖరుకు నూరు శాతం పూర్తి చేయాలి
- అధికారులకు కమిషనర్ రంగారావు దిశానిర్దేశం

మండపేట: మార్చి నెలాఖరుకు ఆస్తిపన్ను నూరు శాతం వసూలు చేయాలని అందుకు పన్నుదారులందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు కోరారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డీఈ కే శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, బీ ఆంజనేయులు, ఆర్వో జేవీఎస్ శాస్త్రి ఇతర అధికారులకు ఆయన ఆస్తిపన్ను వసూళ్లపై పలు సూచనలు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ అధికారులు, సచివాలయ సిబ్బంది పన్ను వసూళ్ల విషయంలో లక్ష్యం పూర్తయ్యే వరకూ కష్టపడి పనిచేయాలన్నారు. మార్చి చివరి నాటికి నూరుశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఇంటి యజమానులు, ఖాళీ స్థలం యజమానులు, మున్సిపల్ షాపు నిర్వాహకులు సైతం అద్దె బకాయిలు లేకుండా చెల్లించాలన్నారు. వసూళ్లకు సచివాలయ సిబ్బందిని టీంలుగా ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది బృందాలుగా విడిపోయి 30 వార్డుల్లోని ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు చెల్లించి వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన వార్డుల్లో పర్యటించారు. పరిసరాలు పరిశుభ్రం, తడి, పొడిచెత్తపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ఆర్పీలు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



రాయవరం పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల ఒకటో తేదీన ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమైన విషయం పాఠకులకు విదితమే. పరీక్షా కేంద్రంలో రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటుగా, శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్లస్–2 విద్యార్థులు, స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఎలాట్ చేశారు. పరీక్షా కేంద్రంలో తెలుగు 33 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 30 మంది హాజరై, ముగ్గురు గైర్హాజరయ్యారు. అలాగే సంస్కృతం పరీక్షను 116 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 115 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి డీవీవీ నాగేశ్వరరెడ్డి చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 10 మంది గైహాజరు

కాజులూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రారంభమయిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 10 మంది విద్యార్థులు గైహాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది కాజులూరు పరీక్షా కేంద్రంలో స్థానిక కళాశాల విద్యార్థులతోపాటు గొల్లపాలెం కాకతీయ కళాశాల, పీఎస్ఎన్ మూర్తి కళాశాలకు చెందిన మొత్తం 485 మంది ఇంటర్ విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. ఇందులో ద్వితీయ సంవత్సరం 225 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా తొలి రోజు 215 మంది హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు.

రైతు రిజిస్ట్రీ నమోదుతో ప్రయోజనాలు



ఓదూరు రైతు సేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రీ నమోదులను పరిశీలిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: భూమి ఉన్న ప్రతి రైతు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రిజిస్ట్రీలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని ఓదూరు రైతు సేవా కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతు రిజిస్ట్రీ, పంట నమోదు తదితర వివరాలను పరిశీలించారు. రైతులు రైతు రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పంటలకు నీరు సక్రమంగా అందుతుందా లేదా అని రైతులను అడిగి తెలసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సమాయకురాలు సాయి ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఆలమూరు: స్థానిక పశుసంవర్ధకశాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో సోమవారం గాలికుంటు వ్యాధి టీకాల ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని పినపళ్లలో పశువైద్యాధికారి సుభాష్, వీఎల్‌ఓ ఈదల శ్రీనివాసు నేతృత్వంలో ప్రారంభమైన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఏడీ ఎల్.అనిత ప్రారంభించారు. ఈ ఏడాదిలో తొలివిడతగా నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాలను పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. స్థానిక జేవీఓ శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామంలోని 252 పశువులన్నింటికీ ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది అందజేశారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రికల్ కార్మికుడి మృతి



మృతుడు దుర్గబాబు (ఫైల్)

మండపేట: పట్టణానికి చెందిన ఎలక్ట్రికల్ కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. దీనికి సంబంధించి తోటి కార్మికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రెండో వార్డు గొల్లలగుంట వీధిలో నివాస ముంటున్న తణుకు దుర్గబాబు(38) ఎలక్ట్రికల్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లిలోని ఓ రైసుమిల్లులో పనికి వెళ్లాడు. మిల్లులో పని చేస్తుండగా అనుకోకుండా దుర్గబాబుకు కరెంట్‌షాక్ తగిలి కింద పడిపోయాడు. అతనిని తోటి కార్మికులు అనపర్తి ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి ప్రైవేటు ఆసపత్రికి చేర్చారు. పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. దుర్గబాబు మృతిపై మండపేట నియోజకవర్గ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ యూనియన్ సంతాపాన్ని తెలిపింది. సంఘ ప్రెసిడెంట్ శెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ యూనియన్ సభ్యుడి మరణం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు యూనియన్ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని అండగా నిలబడాలని కోరారు.

కనుల వైకుంఠంగా శ్రీవారి గ్రామోత్సవం



రథం ముందు కోలాట నృత్య ప్రదర్శన చేస్తున్న మహిళలు

మండపేట: జిల్లాలోనే ఆధ్యాత్మిక గ్రామంలో భాసిల్లుతున్న అర్తమూరులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల వైకుంఠంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం గ్రామంలో వేదపండితులు నిత్య పూజలు మొదలుపెట్టారు. లక్ష్మీ హయగ్రీవ హోమం పూర్తయ్యాక కల్యాణ జరిపించుకున్న శ్రీవారు ఉభయ దేవేరులతో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. గోవిందుడి మాలలు ధరించిన స్త్రీ పురుషులు గోవింద నామాలతో ఆలపిస్తూ స్వామి వారిని పులకింపజేశారు. విష్ణు సహస్ర పారాయణం చేశారు. వీరభద్రపురం, తాపేశ్వరం, ఇప్పనపాడు, మడికి, చిలకలపాడు, కొత్త తుంగపాడు, అంగర గ్రామాల నుంచి వచ్చిన కోలాట బృందాలు నృత్యం చేశాయి. అనంతరం స్వామి వారికి తులాభారం నిర్వహించారు. ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి, అనపర్తి ధర్మ పరీక్ష రక్షణ సమితి అధ్యక్షులు రెడ్డి సురేష్ స్వామి వారి గొప్పతనాన్ని వివరించారు. డాక్టర్లు చిర్ల వేణుమాధవి, కాకర రాగమౌనిక, గుడిమెట్ల వంశీప్రియాంక, చిర్ల దీపకర్‌రెడ్డి, సత్తి సుమధప్రియలను భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కర్రి బాపిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న సత్యమూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన నక్కింటి వెంకటరావు, అంజలీదేవి దంపతులు సోమవారం రూ.15 వేలు విరాళంగా ఇచ్చారు. విరాళాన్ని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తికి అందజేశారు. విరాళం అందించిన వెంకటరావు దంపతులకు అర్చకులు స్వామి వారి వేదఆశీర్వచనం అందించారు. స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. దాత దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులను ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు అభినందించారు.

కంకరగుట్ట ఎక్కి బోల్తా కొట్టిన కారు



అంతర్వేది కొత్తవంతెన వద్ద బోల్తా కొట్టిన కారు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఆదివారం రాత్రి వేగంగా వెళుతున్న కారు ఒకటి రోడ్డు పక్కన ఉన్న కంకర గుట్ట ఎక్కి బోల్తా కొట్టింది. కొత్త వంతెన వద్ద బోల్తా కొట్టిన కారు అంతర్వేది చానల్ వైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్వల్పగాయాలతో బయటపడిన కారు యజమాని రవి కుమార్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే విద్యుత్ స్తంభం ఢీకొట్టిన ఘటనలో కూడా ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై పోలీసులను సోమవారం వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.